## క్లుప్తంగా

### చింతలపూడిలో నేడు గడపగడపకు

**కొయ్యూరు:** ఎం.మాకవరం సచివాలయం పరిధిలో చింతలపూడి, గింజర్తి, లొద్దిపాకలలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం శుక్రవారం ప్రకటనలో పేర్కొంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పాల్గొంటారని, పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు తరలిరావాలని కోరారు.

### నేడు ఎమ్మెల్యే పర్యటన

**వీఆర్ పురం:** మండలంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శనివారం పర్యటించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పొడియం గోపాల్ శుక్రవారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మధ్యాహ్నం 2.00 గంటలకు వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం చినమట్టపల్లి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

### గ్రామ వలంటీర్లకు సన్మానం నేడు

**కూనవరం:** మండల పరిధిలోని కోతులగుట్ట వెలుగు కార్యాలయం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు గ్రామ వలంటీర్లను సన్మానించనున్నారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రజాప్రతిధినిధులు, మండల స్థాయి అధికారులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

### రేపటి నుంచి దారాలమ్మ జాతర

**చింతపల్లిరూరల్:** మండలంలోని కొత్తపాలెం పంచాయతీ కాఫీ వంగసార గ్రామంలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు దారాలమ్మ తీర్థ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, గటాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జాతర సందర్భంగా 11న ఒడిశా కళాకారులచే ధింసా నాట్య ప్రదర్శన, 12న సినీ డూప్స్ కార్యక్రమం, ముగింపు రోజున 13న ఏపీఎఫ్‌డీసీ ఉద్యోగులు, గ్రామస్తుల ఆర్థిక సహకారంతో మెగా డాన్స్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

### వ్యవసాయాధికారిగా శ్రీనివాసరావు

**చింతూరు:** మండల వ్యవసాయాధికారిగా డి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ ఏవోగా పనిచేసిన కృష్ణకాంత్ భీమవరం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

### ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శ



బేతాళుడిని పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

**చింతపల్లిరూరల్:** బైకు ప్రమాదంలో గాయపడిన స్థానిక వర్తక సంఘం కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడును గురువారం రాత్రి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు.ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడి తన నివాసంలో విశ్రాంతి తీసుకొంటున్న ఆయనను పరమర్శించిన వారిలో ఎంపీపీ అనూషదేవి, ఎంపీటీసీ సభ్యులు పద్మ, జయలక్ష్మిలు ఉన్నారు.

### విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**దుంబ్రిగుడ:** మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు శుక్రవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. శాఖా గ్రంథాలయాధికారి సునీత మాట్లాడుతూ వేసవి శిబిరాల్లో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు. ఈనెల 12వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు జరుగుతాయన్నారు.



# గిరిజన గ్రామాల అభివృద్ధే ధ్యేయం



రాయిమామిడిలో రైతులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



గుండాలకాలనీలో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- గడప గడపకు ప్రజా స్పందన
- గ్రామాల్లో ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మిలకు ఘన స్వాగతం

**పెదబయలు:** ఏజెన్సీలో మారుమూల గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని గోమంగి పంచాయతీ గోమంగి, సరియాపల్లి, సంతబయలు, కుమ్మరివీధి, కుమ్మరివీధి కాలనీ, బోయరాజులు తోట, రాయిమామిడి, నక్కలపుట్టు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 291 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా, సకాలంలో అందుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ వలంటీర్ల ద్వారా చెంతకే పింఛన్ పంపిణీ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గోమంగి పంచాయతీ కేంద్రానికి అనుసంధానం చేస్తూ కోట్లాది రూపాయల నిధులతో రహదారుల నిర్మాణం జరిగిందని, గోమంగి మీదుగా వన్నాడ అరడగూడెం తారురోడ్డు నిర్మాణంతో జిల్లా కేంద్రానికి మార్గం సుగమమైందన్నారు. బొండాపల్లి ఘాట్ నుంచి బొండాపుట్టు వరకు, లక్ష్మీపేట నుంచి గోమంగి వరకు రోడ్డు సదుపాయం కల్పించినట్టు చెప్పారు. ప్రతీ గ్రామానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా 42 మంది రైతులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలను పంపిణీ చేశారు.గోమంగిలో రూ. 21.80 లక్షలతో చేపట్టిన రైతు భరోసా కేంద్రాన్ని అరకు ఎమ్మెల్యే పాల్గుణ ప్రారంభించారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాల పంపిణీతో పాటు అన్ని రకాల వ్యవసాయ సేవలను ప్రభుత్వం అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, సర్పంచ్‌లు కొర్ర జెట్టో, రవిశంకర్, ఈవోఆర్డీ నర్సింగరావు, వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సంజీవరావు, ఏపీఎం ఈశ్వరబాబు నాయుడు, మాజీ ఎంపీపీ ఉమామహేశ్వరావు, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ, నాయకులు అప్పలరాజు, సింహాచలం, నాగరాజు, అప్పారావు, మత్స్యకొండబాబు, నవీన్, సచివాలయ కన్వీనర్లు విజయ్‌కుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

**ఎటపాక:** అర్హులైన ప్రతీ పేదవానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఎటపాక మండలం గుండాల గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 123 గడపలను ఎమ్మెల్యే ధనలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన మరింత చేరువైందన్నారు. పార్టీలకతీతంగా, పారదర్శకంగా అన్ని వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖాధికారులతో మాట్లాడుతామన్నారు. ఎంపీపీ కాక కామేశ్వరి, సర్పంచ్ సీతాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత, మండల పార్టీ కన్వీనర్ తానికొండ వాసు, లక్ష్మణ్‌రావు, గోసు ప్రశాంత్, దామెర్ల రేవతి, నర్సింగరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# పర్యావరణ హితం.. గిరిజన జీవనం

- సంప్రదాయ పద్ధతిలో వంటలు
- మట్టి కుండలు, వెదురు బుట్టలు, తట్టల వినియోగం



వెదురుబుట్టలో బీరకాయలు



కాశీపట్నం సంతలో అమ్మకానికి వంకాయలు

**అనంతగిరి:** గిరిజనులు జీవనశైలి వైవిధ్యంగా ఉంటుంది.. ప్రకృతితో మమేకమై..సంప్రదాయ పద్ధతిలోనే జీవనం సాగిస్తారు.. మన్యంలోని పర్యాటక ప్రాంతాలు ఉండడంతో ప్లాస్టిక్ వాడకం పెరిగిపోయింది. ప్రస్తుతం ఏజెన్సీలోని కొన్నిచోట్ల పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. దీంతో మన్యంలోని వాతావరణం కలుషితమవుతోంది.

**ప్రకృతితో మమేకం**

మారుమూల గ్రామాల్లో ప్రకృతితో మమేకమై జీవనం సాగిస్తారు. అడవిలో దొరికే వెదురుతో తయారుచేసిన తట్టలు, బుట్టలను ఉపయోగిస్తున్నారు. పొలాల్లోకి గెత్తం తీసుకువెళ్లేందుకు, పండించిన కూరగాయలను సంతల్లో విక్రయించేందుకు వెదురుతో తయారు చేసిన బుట్టలు, తట్టలను ఉపయోగిస్తున్నారు. పాలిథిన్ వినియోగానికి దూరంగా ఉంటున్నారు. వంటకు మట్టిపాత్రలను ఉపయోగిస్తారు. నీరు నిల్వచేసేందుకు మట్టికుండలనే ఉపయోగిస్తున్నారు. నీరు తాగేందుకు ఆనపకాయ డిప్పలను ఉపయోగిస్తున్నారు. వారపు సంతల్లో సైతం మట్టి కుండల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.. వెదురు బొంగుల్లో వంటకాల తయారీకి ప్రాధాన్య మిస్తున్నారు. ఏజెన్సీలో అన్ని గ్రామాల్లో పంటలను గిరిజన రైతులు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఎటువంటి రసాయా ఎరువులు వినియోగించకుండా మన్యంలో పండించే ఆకుకూరలు, కూరగాయాలకు మైదాన ప్రాంతాల్లో గిరాకీ ఉంది. మన్యంలో ప్రకృతి సాగుకు గిరిజన రైతులు ప్రాధాన్యమిస్తున్నారు. ఇలా ప్రకృతితో మమేకమై జీవనం సాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

# సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందచేత



శైలజకు చెక్కు అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

**చింతూరు:** మండలంలోని పేగకు చెందిన వుయికా శైలజకు శుక్రవారం చింతూరులో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును అందజేశారు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న శైలజ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి శైలజకు రూ,36 వేలు మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీలు మేడేపల్లి సుధాకర్, యడమ అర్జున్, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు సర్పంచ్‌లు పాయం చంద్రయ్య, సవలం సత్తిబాబు, ఉపసర్పంచ్ బాబూరావు, నాయకులు రాంప్రసాద్, మురళి, ఖాదర్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు శామ్యూల్

**హుకుంపేట:** విజయవాడలోని తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి అధ్యక్షతన వాణిజ్య విభాగాల రాష్ట్ర అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జిలు, అధ్యక్షులతో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం విజయసాయిరెడ్డిని పార్టీ అల్లూరి జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్ మర్యాదపూర్వకంగా కలిశారు.

గిరిజన ప్రాంత సమస్యలను ఆయనకు వివరించారు. ఏజెన్సీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతున్నాయన్నారు. కొండపోడు పట్టాలు పంపిణీతో గిరిజనులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

### 14, 15 తేదీల్లో ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

**అరకులోయ రూరల్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాల కోసం ఈనెల 14, 15 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు తప్పనిసరి హాజరుకావాలన్నారు. పూర్తి సమచారం కోసం నేరుగా కళాశాలలో సంప్రదించాలని కోరారు.

# అభివృద్ధి పథకాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుంజం మురళీ

**దేవీపట్నం:** దేవీపట్నం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఇందుకూరుపేటలో వెలుగు కార్యాలయంలో ఎంపీపీ కుంజం మురళీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పోడు భూముల సమస్య, రోడ్లు నిర్మించాలని, తాగునీటి ఇబ్బందులు తీర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మురళి మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశానికి హాజరుకాని కొన్ని శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకూ ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.రత్నకుమారి పదొన్నతిపై రెగ్యులర్ ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకోవడంతో మండల పరిషత్ సభ్యులు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. వైస్ ఎంపీపీ గారపాటి మురళీకృష్ణ, కందుల బాబ్జి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సూచనలిస్తున్న వైద్యాధికారి భాస్కర్

**అడ్డతీగల:** గర్భిణులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారి భాస్కర్ అన్నారు. ప్రధానమంత్రి సురక్షా మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎల్లవరం పీహెచ్‌సీలో 122 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి భాస్కర్ మాట్లాడుతూ తల్లీ, బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే మంచి పోష్టికాహారం తీసువాలన్నారు. గర్భిణులు తరచూ వైద్య పరీక్షలు చేసుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం వల్ల ఎటువంటి అనారోగ్యాలకు లోనుకాకుండా ఉంటారన్నారు. అడ్డతీగల సీహెచ్‌సీలో 81 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### గంగాలమ్మ తల్లికి పూజలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

**రాజవొమ్మంగి:** మండలంలోని లాగరాయి గ్రామంలో టీటీడీ నిర్మించిన గంగాలమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. చోడి సత్యనారాయణ, గిరిజన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, హోమాలు జరిపారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ముగిసిన వాలీబాల్ పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

**అరకులోయ రూరల్:** క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని నేచర్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ బాలరాజు చెప్పారు. మండలంలోని కంఠభంసుగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ(బాలురా) పాఠశాల మైదానంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నీ శుక్రవారం ముగిసింది. పోటీల్లో 18 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకులు, నేచర్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ బాలరాజు మాట్లాడుతూ గిరిజన యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పోటీలో విజేతలకు నగదు, ట్రోఫీలను అందజేశారు. హెచ్ఎం దయానిధి, స్వచ్ఛంద సంస్థ సిబ్బంది రామ్‌చందర్, సంతోష్, ప్రసాద్, చలం, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ-క్రాప్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

**చింతపల్లిరూరల్:** గిరిజన రైతులు పండించే పంటలకు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని ఎంపీడీవో ఆశాజ్యోతి, ఏవో శ్రీనివాసరావు కోరారు. లోతుగడ్డలో శుక్రవారం ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో వారు మాట్లాడుతూ పంటలకు ఈ-క్రాప్ చేయడం వలన విపత్తుల కారణంగా పంటలు దేబ్బతింటే ప్రభుత్వం నుంచి పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. భూసార పరీక్షలు చేయించుకోని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాల మేరకు సాగుచేస్తే మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. సర్పంచ్ చింతర్ల సునీల్, ఎంపీటీసీ సభ్యుడు బాబూరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, సలహా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### సర్పంచ్‌ను పరామర్శించిన శివప్రసాద్



సర్పంచ్ రాజకుమారిని పరామర్శిస్తున్న శివప్రసాద్

**కొయ్యూరు:** కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న నల్లగొండ సర్పంచ్ జంపా రాజుమారిని నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు కె.శివప్రసాద్ శుక్రవారం పరామర్శించారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతున్న సమాచారాన్ని తెలుసుకున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి సర్పంచ్‌ను పరామర్శించాలని శివప్రసాద్‌కు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచ్ రాజకుమారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎలాంటి అవసరమైన సాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

### 12న విగ్రహాల ప్రతిష్ట



సమావేశంలో మాట్లాడుతున్న అర్చకుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ

**గూడెంకొత్తవీధి:** మండలంలోని అసరాడ జ్యోతిర్మయి బాబా ధ్యాన మందిరంలో ప్రతి నెల 5వ తేదిన మండల అర్చకుల సమావేశం నిర్వహించనున్నట్టు అర్చకుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. మందిరంలో అర్చకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. గిరిజన అర్చకుల సంక్షేమ సంఘం సమావేశం ప్రతి నెల 5న నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఈ నెల 12 న గింజంగి గ్రామంలో సీత,రామ,లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్టించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి అర్చకులు అంత తరలిరావాలని ఆయన కోరారు. సంఘం మండల కార్యదర్శి కిల్లో సింహాచలం, జ్యోతీర్మయి బాబా ధ్యాన మందిర ధర్మకర్త రామారావు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ బీమా అందజేత



మృతుడి కుటుంబ సభ్యులకు బీమా నగదు అందజేస్తున్న సర్పంచ్ రామారావు తదితరులు

**వీఆర్ పురం:** చింతరేవుపల్లి గ్రామానికి చెందిన గూటాల శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా శుక్రవారం వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేల నగదును సర్పంచ్ పిట్టా రామారావు చేతులమీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందచేశారు. మిగిలిన బీమా నగదు రూ.90 వేలు బ్యాంక్ ఖాతాకు నేరుగా జమ అవుతాయని ఆయన చెప్పారు. నాయకులు మురళి, సచివాలయ కన్వీనర్ జయరాజ్, ముత్యాలరావు, సీతయ్య, వలంటీర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


### మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



సుబ్బారావు (ఫైల్)

**వీఆర్ పురం:** రేఖపల్లి మాజీ సర్పంచ్ బంధం సుబ్బారావు (90) శుక్రవారం మృతి చెందారు. ఉమ్మిడివరం గ్రామానికి చెందిన సుబ్బారావు పంచాయతీ అభివృద్ధికి కృషి చేశారని వైఎస్సార్‌సీపీ మండల మహిళా కన్వీనర్ బంధం విజయలక్ష్మి అన్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

### కోర్టు ఉద్యోగి వెంకటేశ్వర్లు మృతికి సంతాపం



వెంకటేశ్వర్లు

**రాజవొమ్మంగి:** రాజమండ్రిలోని 9వ అడిషనల్ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజవొమ్మంగికి చెందిన ఐనవల్లి వెంకటేశ్వర్లు (54) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

### నిబంధనల సడలింపునకు వినతి

**చింతూరు:** కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసే విషయంలో ఏజన్సీలో సర్వీసు నిబంధనలు సడలించాలని కోరుతూ ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అయిదేళ్ల సర్వీసు నిబంధన కారణంగా ఏజన్సీలో ఉద్యోగులకు నష్టం జరిగే అవకాశముందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ప్రాంతంలో రెండేళ్ల సర్వీసు మాత్రమే కలిగి ఉన్నారని, సమస్యను పరిష్కరించేలా చూడాలని వినతిలో కోరారు. విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఆమె హామీనిచ్చినట్టు వారు తెలిపారు. జోగారావు, సత్తిబాబు, అర్జున్, కోటేశ్వరరావు, విజయ్, బుచ్చయ్య, గౌరీ, స్వరూప, కృష్ణకుమారి పాల్గొన్నారు.

### బిర్సాముండాకు నివాళి



బిర్సాముండ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఐటీఐ సిబ్బంది

**చింతపల్లి:** స్థానిక ఆర్ఐటీఐలో శుక్రవారం స్వతంత్ర సమరయోధుడు బిర్సా ముండా వర్ధంతిని నిర్వహించారు. విద్యాలయంలో ప్రిన్సిపాల్ రాజారావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. శిక్షణ అధికారులు కృష్ణవేణి, శ్రీనివాస్, సూపరింటెండెంట్ రవికిరణ్, అధ్యాపకులు ఈశ్వరరావు, ఆనంద్ తదితరలు పాల్గొన్నారు.